క్లుప్తంగా

విద్యుత్ చార్జీల భారం ఆపాలి

కడప వైఎస్సార్ సర్కిల్ : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వరుసగా మోపుతున్న విద్యుత్ చార్జీల భారాన్ని వెనక్కి తీసుకోవాలని సీపీఎం కడప నగర కార్యదర్శి ఎ. రామమోహన్ డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలక ప్రభుత్వాలు విద్యుత్ రంగాన్ని అస్తవ్యస్తం చేస్తున్నాయని విమర్శించారు. అప్రకటిత విద్యుత్ కోతలను నివారించేందుకు జిల్లా విద్యుత్ శాఖ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు.ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎస్. గోవిందు పాల్గొన్నారు.

మహిళలే జగనన్న సైన్యం

కడప కార్పొరేషన్ : రాష్ట్రంలోని మహిళలే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి మహా సైన్యమని, రాబోయే ఎన్నికల్లో వారు స్టార్ క్యాంపెయినర్లుగా వ్యవహరిస్తారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్ ఖాన్ అన్నారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నాలుగున్నర సంవత్సర కాలంలో జగనన్న ప్రభుత్వం మహిళల సంక్షేమానికి పెద్దపీట వేసిందని.. ఇందులో చాలా మేరకు నగదును వారి ఖాతాలకే జమ చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం చేపట్టిన పథకాలు మహిళల పేరు మీదనే అందించడం జరిగిందన్నారు. నామినేటెడ్ పదవుల్లో, పనుల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించారన్నారు. మంచి మనసున్న ముఖ్యమంత్రిని మహిళలు ఆశీర్వదించాలని కోరారు.

ఓటరు చైతన్య ర్యాలీ

వైవీయూ : కడప నగరంలోని నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలో జాతీయ ఓటరు దినోత్సవం పురస్కరించుకుని ముందస్తుగా చైతన్యర్యాలీ నిర్వహించారు. బుధవారం కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో కళాశాల నుంచి అంబేద్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు సి. సుబ్బనరసయ్య, ఎస్. శ్రావణిలు మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటుహక్కు నమోదు చేసుకోవాలని సూచించారు. అనంతరం ఓటరు హక్కు ప్రతిజ్ఞ నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

మహాసభ జయప్రదం చేయండి

కడప వైఎస్సార్ సర్కిల్ : ఈ నెల 28న నెల్లూరులోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్న యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర రెండవ మహాసభలను జయప్రదం చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు కామనురు శ్రీనివాసులురెడ్డి తెలిపారు. బుధవారం నగరంలోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో రాష్ట్ర మహాసభలకు సంబంధించిన పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పీసీ కొండయ్య, రియాజ్, సురేంద్ర, శివప్రసాద్, నందీశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కడప కోటిరెడ్డిసర్కిల్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో డీడీయూజీకేవై పథకం ద్వారా సీ–డ్యాప్ సౌజన్యంతో గ్రామీణ నిరుద్యోగ యువతీ యువకుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు నిహార్ స్కిల్ ఎడ్యుకేషనల్ రీజినల్ కో ఆర్డినేటర్ సుబ్బరామిరెడ్డి తెలిపారు. 18–32 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన యువతకు ఎలక్ట్రానిక్ రంగంలో కంప్యూటర్ హార్డ్‌వేర్, హెల్త్‌కేర్ రంగంలో ఎమెర్జెన్సీ మెడికల్ టెక్నిషియన్, ఐటీ రంగంలో జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నామన్నారు. ఉపాధి పథకంలో 100 రోజులు పనిచేసిన కుటుంబాల్లోని యువత అర్హులన్నారు. ఇతర వివరాలకు 90630 82227, 99664 48807 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

దుప్పట్ల పంపిణీ



దుప్పట్ల పంపిణీ చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరంలోని రోడ్డు వారగా ఉంటున్న అనాథలు, యాచకులకు బుధవారం దుప్పట్లు పంపిణీ చేశారు. విద్యుత్ ఉద్యోగులు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం చలి తీవ్రత ఉన్న నేపథ్యంలో దుప్పట్లను పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ సంస్థ ఎస్ఈ రమణ, ఈఈ (టెక్నికల్) హరి సేవియా నాయక్, డిప్యూటీ ఈఈ రమేష్‌తో పాటు ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ నాయకుల నిరసన

కడప ఎడ్యుకేషన్ : ఉద్యోగ, ఉపాధ్యాయులను ప్రభుత్వం విస్మరించడం తగదని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు మాదన విజయ్‌కుమార్ అన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం కడప జిల్లాశాఖ ఆధ్వర్యంలో యూటీఎఫ్ నాయకులు కళ్లకు గంతలు కట్టుకుని కడప నగరంలోని మహావీర్ సర్కిల్ నుంచి కలెక్టరేట్ వరకు వినూత్నంగా నిరసన ప్రదర్శనను చేపట్టారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షులు రవికుమార్, ట్రెజరర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం కోసమే 'గడప గడపకు మన ప్రభుత్వం'

ఉప ముఖ్యమంత్రి ఎస్.బి.అంజాద్ బాషా



'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో వృద్ధుడికి బుక్‌లెట్‌ను అందిస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్ : ప్రజా సంక్షేమం కోసమే 'గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం' నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్.బి అంజాద్ బాష అన్నారు. బుధవారం 40 వ డివిజన్‌లోని మరియాపురం, స్టేట్ బ్యాంక్ కాలనీ సమీపంలోని పలు వీధుల్లో ఇంటింటికీ సందర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఏవిధంగా ప్రజలకు చేరుతున్నాయని అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత ఉండి ఇంకా ఎవరైనా సంక్షేమ పథకాలు కోల్పోయి ఉంటే వారికోసం 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని నిర్వహించి అర్హులందరికీ పథకాలు అందిస్తున్నామన్నారు. షేక్ నసీం అనే మహిళ మాట్లాడుతూ జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన, జగనన్న అమ్మ ఒడి, వైఎస్ఆర్ పింఛన్ కానుక, వైఎస్ఆర్ ఆసరా, వైఎస్సార్ సున్నా వడ్డీ పథకాల ద్వారా రూ.1.80లక్షలు లబ్ధి పొందామని, ఈ ప్రభుత్వానికి ఎల్లప్పుడూ బాసటగా ఉంటామని ఆనందం వ్యక్తం చేసింది. ఎం. మేరీ అనే మహిళ మాట్లాడుతూ జగనన్న అమ్మ ఒడి, వైఎస్ఆర్ పింఛన్ కానుక, వైఎస్ఆర్ సున్నా వడ్డీ వంటి పథకాల ద్వారా రూ. 1.65లు లబ్ధి చేకూరిందని దీంతో మా కుటుంబం అంతా సంతోషంగా ఉన్నామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు మాసీమ బాబు, సోషల్ వెల్ఫేర్ బోర్డ్ ఛైర్మన్ పులి సునీల్ కుమార్, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, 40 వ డివిజన్ కార్పొరేటర్ ఆర్. బాలస్వామి రెడ్డి, హరూన్ గ్రూప్స్ ఎండీ అహ్మద్‌బాషా, పార్టీ నాయకులు బంగారు నాగయ్య యాదవ్, ఎస్. సుబ్బారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, ఉమైర్, వస్తం అంజి, సీహెచ్ సునీల్, మహిళా నాయకురాళ్లు నసీం సుల్తానా, మౌలానీ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నిగ్రహశక్తిని పెంపొందించేలా చర్యలు

ప్రిన్సిపాల్ డా. జి.రవీంద్రనాథ్



మాట్లాడుతున్న ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ రవీంద్రనాథ్

వైవీయూ : చిన్నచిన్న విషయాలకే విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడటం బాధాకరమని, విద్యార్థుల్లో నిగ్రహశక్తిని, ఆత్మస్థైర్యాన్ని పెంపొందించేలా అధ్యాపకులు కృషిచేయాలని కడప ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్ సూచించారు. బుధవారం కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో యునెస్కో, కళాశాల విద్య సంయుక్త ఆధ్వర్యంలో 'సెల్ఫ్ డైరెక్టెడ్ ఎమోషనల్ లెర్నింగ్ ఫార్ ఎంపతీ అండ్ కైండెనెస్/సోషల్ ఎమోషనల్ లెర్నింగ్' అన్న అంశాలపై డిగ్రీ కళాశాల అధ్యాపకులకు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు కుటుంబం, సమాజం పట్ల బాధ్యతగా మెలిగేలా చూడాల్సిన బాధ్యత అధ్యాపకులపై ఉందన్నారు. మానసికంగా విద్యార్థులను ధృడంగా ఉంచేందుకు ప్రత్యేక మనోవికాస తరగతులు నిర్వహించాలని సూచించారు. వర్చువల్ విధానంలో కళాశాల విద్య కమిషనర్ డా. పోలా భాస్కర్, ఎంజీఐఈపీ ప్రతినిధి డా. శోభిత ప్రసంగించారు. వర్క్‌షాప్‌కు మెంటార్లుగా డా. సి. రమణారెడ్డి, డా. ప్రేమలత, శివమ్మ వ్యవహరించగా, ఎస్ఆర్‌సీ కోఆర్డినేటర్ డా. సుందరేశ్వరరావు, శ్రీనివాసులు, వైవీయూ పరిధిలోని డిగ్రీ కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు.

మెరుగైన సౌకర్యాలను కల్పించాలి

జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్



మాట్లాడుతున్న జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్

కడప అర్బన్ : హాస్టళ్లలో పిల్లలకు మెరుగైన సౌకర్యాలను కల్పించాలని, వారి ఆరోగ్య పరిస్థితులపై అప్రమత్తంగా వుండాలని జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ అన్నారు. బుధవారం కడప నగరం చిన్నచౌక్‌లో వున్న ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలను జడ్జి తమ సిబ్బందితో కలిసి సందర్శించారు. వసతి గదిలో ఫ్యాన్‌లు గానీ, లైట్లుగానీ లేకపోవడం, బాత్‌రూంలో నీళ్లు నిలిచి వుండడం, పిల్లలకు సోపులు ఇవ్వకపోవడం హాస్టల్‌లో హిందీ, మ్యాథ్స్ టీచర్లు లేకపోవడం, సరైన దారి లేకపోవడంపై జడ్జి అసహనం వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులకు తదుపరి చర్యలకోసం సిఫారసు చేశారు. పిల్లలకు అందుతున్న సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. వంటగదులను, వసతి గదులను, తరగతి గదులను పరిశీలించారు. మధ్యాహ్న భోజన సమయంలో వారికి అందుతున్న భోజనం సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. పిల్లల విద్యా, ఆరోగ్య విషయాలపట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఏవైనా సమస్యలుంటే జిల్లా న్యాయసేవాధికార సంస్థను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఏ. మణికుమారి, వార్డెన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

26న నిరసన

కడప వైఎస్ఆర్ సర్కిల్: ఈ నెల 26న మోడీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక రైతాంగ వ్యతిరేక విధానాలపై ఐటిఐ సర్కిల్ గాంధీ విగ్రహం ఎదుట నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు వామపక్ష రైతు సంఘాల జిల్లా అధ్యక్ష , కార్యదర్శులు ఎంవి సుబ్బారెడ్డి, దస్తగిరి రెడ్డి తెలిపారు. బుధవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. రైతులు, పేదలు, కార్మికులు, సామాన్య ప్రజల సమస్త ప్రయోజనాలను నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు కట్టబెట్టడాన్ని నిరసిస్తూ రిపబ్లిక్ డే సందర్భంగా 26 'క్విట్ కార్పొరేట్– దేశ్‌కి బచావో' నినాదంతో నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

28న జిల్లా మహాసభ

కడప వైఎస్ఆర్ సర్కిల్: ఈనెల 28న జిల్లాలోని ప్రొద్దుటూరులో భవన నిర్మాణ కార్మికుల 5వ జిల్లా మహాసభలను నిర్వహిస్తున్నట్లు ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉద్దె మద్దిలేటి పేర్కొన్నారు. బుధవారం నగరంలోని హోచిమెన్ భవన్‌లో జిల్లా మహాసభలకు సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి లింగన్న, నగర నాయకులు ఈశ్వరయ్య, ఎం.రామాంజినేయులు, మున్నా, రవి తదితరులు పాల్గొన్నారు.

నగర దేవాలయాల పాలక మండళ్లకు అనుమతి

కడప కల్చరల్ : కడప నగరంలోని నాలుగు దేవాలయాల పాలక మండళ్లను నియమించుకునేందుకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందని కడప గ్రూప్ ఆఫ్ టెంపుల్స్ శ్రీధర్ తెలిపారు. నగరానికి చెందిన మోచంపేట శ్రీ ప్రసన్న విశ్వేశ్వరస్వామి ఆలయం, మృత్యుంజయకుంటలోని శ్రీ మృత్యుంజయేశ్వర స్వామి ఆలయం, పుట్లంపల్లె పరిధి పాలకొండల్లో గల శ్రీ పాలకొండ్రాయస్వామి ఆలయం, దేవునికడపలోని శ్రీ సోమేశ్వరస్వామి ఆలయాలకు కొత్తగా పాలక మండళ్లను నియమించుకునేందుకు ప్రభుత్వం అనుమతించిందని దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ శంకర్ బాలాజీ ఉత్తర్వులు ఇచ్చారని తెలిపారు. ముందున్న పాలక మండళ్ల పదవీ కాలం ముగియడంతో ప్రస్తుతం ఈ దేవాలయాలకు పాలక మండళ్లు లేవని ఈఓ శ్రీధర్ తెలిపారు. ప్రకటన వెలువడిన 20 రోజుల్లోగా ఆసక్తిగల వారు తమ దరఖాస్తులను శాఖ కార్యాలయానికి చేర్చాలని, పరిశీలన అనంతరం చట్టప్రకారం నూతన పాలక మండళ్లను నియమిస్తారని తెలిపారు. పూర్తి వివరాలకు కడప గ్రూప్ ఆఫ్ టెంపుల్స్ ఈఓ శ్రీధర్ (73963 54149)ను సంప్రదించాలన్నారు.

వర్షపునీరు సజావుగా వెళ్లేందుకు చర్యలు



అక్కాయపల్లె పార్కు వద్ద అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

కడప కార్పొరేషన్ : కడప నగరంలో ఎక్కడా వర్షపు నీరు నిలవకుండా కాలువల్లోకి వెళ్లేలా తగిన చర్యలు చేపట్టాలని నగరపాలక కమిషనర్ జీఎస్ఎస్ ప్రవీణ్ చంద్ ఆదేశించారు. బుధవారం మార్నింగ్ విజిట్లో భాగంగా కడప నగరంలో నిర్మిస్తున్న వరదనీటి కాలువలను, అక్కాయపల్లె పార్కును ఆయన పరిశీలించారు. గురుకుల్ విద్యాపీఠ్ నుంచి చిన్నచౌకు పోలీస్‌స్టేషన్ వరకూ నిర్మిస్తున్న వరదనీటి కాలువలో నిర్మాణ లోపాలు లేకుండా చూడాలన్నారు. కోటిరెడ్డి సర్కిల్ వద్ద కల్వర్టు ఏర్పాటు చేయుటకు ప్రణాళికలను సిద్ధం చేయాలన్నారు. అక్కాయపల్లె పార్కునందు ఈఎల్ఎస్ఆర్ వద్ద ఆక్యుపంచర్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. పనులు త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలన్నారు. పార్కులో పచ్చదనంతో కూడిన అందమైన మొక్కలు ఏర్పాటు చేసి, ఆకర్షణీయంగా విద్యుత్ అలంకరణ చేయాలన్నారు. పార్కుకు వచ్చిన ప్రజలకు మరుగుదొడ్ల సౌకర్యం ఉండేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ రత్నాల రాజు, డీఈలు వేణుగోపాల్, అబ్దుల్ హమీద్, హార్టీకల్చర్ ఏడీ అనిల్‌కుమార్, సచివాలయ సెక్రటరీలు పాల్గొన్నారు.

నేడు, రేపు

బాల యేసు ఉత్సవాలు



మాట్లాడుతున్న గుడిమె దేవ సహాయం

కడప కల్చరల్ : కడప నగరంలోని మాసాపేట సెయింట్ జాన్ చర్చి ఆవరణలో గురు, శుక్రవారాల్లో బాల యేసు ఉత్సవాలను నిర్వహించనున్నట్లు చర్చి విచారణ గురువులు రెవరెండ్ ఫాదర్ గుడిమె దేవ సహాయం అన్నారు. బుధవారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ ఉత్సవాలకు కడప అపోస్థలిక పాలనాధికారి డాక్టర్ గాలి బాలి అతిథిగా హాజరవుతారని తెలిపారు. గురువారం సాయంత్రం 5 గంటలకు ఉత్సవాలు ప్రారంభమవుతాయని, 6 గంటలకు పవిత్రాత్మ స్వస్థల ప్రార్థనా కూటములు రెవరెండ్ ఫాదర్ లక్కినేని పీటర్ ప్రభాకర్ నిర్వహిస్తారన్నారు. ఇందులో వాక్య పరిచర్య, రోగులు, కుటుంబాలు, యవ్వనస్తుల కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తామన్నారు. బిషప్ సమిష్టి దివ్యబలిపూజ, అనంతరం సకల ఆశీర్వాదాలు ఇస్తారని వివరించారు.

సురక్షిత డ్రైవింగ్‌తో ప్రమాదాలకు అడ్డుకట్ట



డ్రైవర్లకు రోజా పూలు అందజేస్తున్న అసిస్టెంట్ మేనేజర్ కన్యాకుమారి తదితరులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆర్టీసీ డ్రైవర్లు సురక్షిత డ్రైవింగ్‌తో ప్రమాదాలకు అడ్డుకట్ట వేయవచ్చని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ గోపాల్‌రెడ్డి సూచించారు. ఈనెల 15 నుంచి ఫిబ్రవరి 14వ తేది వరకు రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా బుధవారం డ్రైవర్స్ డేని కడప డిపోలో నిర్వహించారు. ఆర్ఎం మాట్లాడుతూ ప్రతి డ్రైవరుకు రోజా పువ్వును అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో నాగార్జున మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొని డ్రైవర్లకు పూలతోపాటు పండ్లు, స్వీట్లు అందజేసి సురక్షిత డ్రైవింగ్ చేయాలని శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కడప డిపో మేనేజర్ డిల్లీశ్వరరావు, అసిస్టెంట్ మేనేజర్ కన్యాకుమారి, ఏడీసీ మల్లికార్జునరావు, జయరాంతోపాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

డ్రైవర్ల సహకారం మరువలేనిది

కడప కోటిరెడ్డిసర్కిల్ : విద్యార్థులను ప్రతిరోజు విద్యా సంస్థకు తీసుకెళ్లి తిరిగి తీసుకురావడంలో భద్రతా పరంగా డ్రైవర్లు అందిస్తున్న సహకారం మరువలేనిదని కేంద్రీయ విద్యాలయ పేరెంట్స్ అసోసియేషన్ ట్రెజరర్ జితేంద్ర తెలిపారు. బుధవారం డ్రైవర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని కడప ఆర్టీసీ బస్టాండ్‌లో కేవీ విద్యార్థులు, తల్లిదండ్రులు, ఆర్టీసీ అధికారులు ఆయా డ్రైవర్లను అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజా రవాణా అధికారి గోపాల్ రెడ్డి మాట్లాడుతూ డ్రైవర్ల ఏకాగ్రత, క్రమశిక్షణ కారణంగా ఆర్టీసీ బస్సుల భద్రత, సమయపాలన మెరుగైందన్నారు. సంస్థలను అగ్రపథాన నడిపిస్తున్న డ్రైవర్లను ప్రత్యేకంగా అభినందిస్తున్నామన్నారు. కడప డిపో మేనేజర్ ఢిల్లీశ్వరరావు మాట్లాడుతూ తల్లిదండ్రులు, విద్యార్థులు డ్రైవరుకు సహకరించాలన్నారు. కేంద్రీయ విద్యాలయ విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ సందర్భంగా డ్రైవర్లకు గులాబీలు, స్వీట్లు, పండ్లు అందించి అభినందించారు. అనంతరం బస్సు డ్రైవర్లు పలు సూచనలు చేశారు.

ఈ కార్యక్రమంలో ఏపీఎస్ ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ కన్యాకుమారి, చీఫ్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మంజులా కిరణ్, ఏడీసీ మల్లిఖార్జున రావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : బీజేపీ ప్రభుత్వం జిల్లాలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. బుధవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో సీపీఐ జిల్లా సమితి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉక్కు పరిశ్రమ స్థాపనకు అవసరమైన మౌలిక సదుపాయాలైన రోడ్డు, రైల్వే, విమాన సౌకర్యంతో పాటు నీళ్లు, కరెంటు, 27 వేల ఎకరాల భూములు కలిగి ఉన్నప్పటికీ ఇవేవీ కేంద్ర ప్రభుత్వానికి కనిపించకపోవడం దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సుబ్రహ్మణ్యం, ఎస్. విజయలక్ష్మి, వి. వీరశేఖర్, కే.సి.బాదుల్లా, జి. వేణుగోపాల్, పి.భాస్కర్, మునయ్య, మల్లికార్జున, వర్మ, నాగేశం, ఇమ్మానియేల్, బ్రహ్మం పాల్గొన్నారు.

మైనార్టీసెల్ వెబ్‌సైట్ ప్రారంభం



వెబ్‌సైట్‌ను ప్రారంభిస్తున్న వైవీయూ వీసీ ఆచార్య చింతా సుధాకర్, అధ్యాపకులు

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయంలో మైనార్టీ సెల్ ఆధ్వర్యంలో ఐటీసెల్ సహకారంతో రూపొందించిన వెబ్‌సైట్‌ను వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ ప్రారంభించారు. బుధవారం విశ్వవిద్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఐక్యూఏసీ సెల్ డైరెక్టర్ డా. ఎల్. సుబ్రమణ్యంశర్మ, ఐటీ సెల్ డైరెక్టర్ ఆచార్య ఎం.వి. శంకర్, మైనార్టీసెల్ డైరెక్టర్ డా. కె. రియాజున్నీసాలతో కలిసి వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విద్యార్థుల సంక్షేమానికి మైనార్టీ సెల్ కృషిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా డా. రియాజున్నీసా మాట్లాడుతూ విద్యార్థుల కెరీర్‌కు అవసరమైన నైపుణ్యాలను సన్నద్ధం చేసేందుకు వెబ్‌సైట్ ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ప్రవేశాల సంచాలకులు డా. లక్ష్మీప్రసాద్, డా. సురేష్‌బాబు, రఫీక్, కరీముల్లా, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

అవసరానికి మించి ఎరువులు వాడవద్దు



కోట్లూరులో వరి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

వల్లూరు : పంటల్లో అవసరానికి మించి ఎరువులు వాడటం అనర్థదాయకమని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త మురళీకృష్ణ తెలిపారు. వల్లూరు మండల పరిధిలోని కోట్లూరు గ్రామంలో సాగు చేసిన వరి పంటను జిల్లా వనరుల కేంద్రం శాస్త్రవేత్తలు బుధవారం పరిశీలించి మాట్లాడారు. వరి పంట సాగులో అవసరానికి మించి రసాయన ఎరువులను వాడటంతో పాటు కాంప్లెక్స్ ఎరువులను పైపాటుగా వేయడం వలన పంటను కాండం కుళ్లు తెగులు ఆశించి సల్ఫైడ్ ఇంజూరీతో మొక్కలు చనిపోతున్నట్లు గుర్తించడం జరిగిందన్నారు. దీని నివారణకు గానూ రైతులు పంట పొలంలో నీటిని పూర్తిగా తీసి వేసి రెండు రోజుల పాటు ఎండబెట్టాలని తెలిపారు. దీంతో బాటుగా ప్రొపికొనజోల్ మందును లీటరు నీటికి ఒక మిల్లీ చొప్పున లేదా హెక్సాకొనజోల్ మందును లీటరు నీటికి 2 మిల్లీ చొప్పున కలిపి పిచికారి చేయాలని సూచించారు. రైతు శిక్షణ కేంద్రం అసిస్టెంట్ డైరెక్టర్ రమణారెడ్డి మాట్లాడుతూ పొలంలో మురుగు నీటిని తీసి వేయడానికి తప్పని సరిగా కాలువలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సరైన పంట రకాలను ఎంపిక చేసుకోవాలని, మూడు పంటలకు ఒక సారి తప్పని సరిగా జింక్ సల్ఫేట్‌ను వేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖాధికారి సాయిజ్యోతి, రైతులు పాల్గొన్నారు.

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి

జిల్లా స్త్రీ, శిశు సంక్షేమాధికారి శ్రీ లక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా స్త్రీ శిశు సంక్షేమాధికారి శ్రీ లక్ష్మి

కడప ఎడ్యుకేషన్ : నేటి పోటీ ప్రపంచంలో బాలికలు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా స్త్రీ శిశు సంక్షేమ సాధికారతాధికారి శ్రీ లక్ష్మి పేర్కొన్నారు. సమగ్ర బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం కడప నగర శివార్లలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలు ఉన్నత చదువులు చదివి గొప్ప పదవులు అధిరోహించాలన్నారు. బాలికలందరూ శ్రద్ధ పెట్టి పట్టుదలతో చదవాలని తద్వారా తల్లిదండ్రుల నమ్మకాన్ని పొందాలన్నారు. తల్లిదండ్రులు అబ్బాయి, అమ్మాయి అనే వివక్ష లేకుండా ఇద్దరినీ సమానంగా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ జ్యోతిర్మయి, బాలల పరిరక్షణ అధికారి సుభాష్‌యాదవ్, గురుకుల పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గెలుపోటములు సహజం



కమలాపురం : క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

కమలాపురం : క్రీడల్లో గెలుపోటములు సహజం అని, క్రీడలతో శారీరక దారుఢ్యాన్ని, మానసిక ఉల్లాసాన్ని, ప్రశాంతతను పొందవచ్చని, ప్రతి క్రీడాకారుడు క్రీడా స్ఫూర్తితో ఆడాలని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక సీఎస్ఐ చర్చి మైదానంలో జరిగిన ఆడుదాం..ఆంధ్ర నియోజకవర్గ స్థాయి పోటీలను ఆయన సీకేదిన్నె జడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డితో కలసి బ్యాటింగ్ ఆడి ప్రారంభించి మాట్లాడారు. ఏ ప్రభుత్వం ఇలా క్రీడా పోటీలను నిర్వహించలేదన్నారు. ప్రతి అంశంలో కమలాపురం నియోజకవర్గ జట్టు రాష్ట్ర స్థాయిలో రాణించాలన్నారు. సీకే దిన్నె జడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డి మాట్లాడుతూ గ్రామీణ స్థాయి క్రీడాకారుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు సచివాలయ స్థాయి నుంచి జగనన్న క్రీడా పోటీలు నిర్వహించారన్నారు. నియోజకవర్గ, మండల స్పెషలాఫీసర్లు యదు భూషణ్‌రెడ్డి, నరసింహారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం రూ.35వేలు, రూ.15వేలు, రూ.5వేలు ప్రైజ్ మనీ ప్రకటించిందని, ఆ బహుమతులకు మరో రూ.65వేలు, రూ.35వేలు, రూ.20వేలు ఎమ్మెల్యే సొంత నిధులు జోడించి రూ.1లక్ష, రూ.50 వేలు, రూ.25వేల ప్రైజ్ మనీ ఇవ్వడంతో పాటు క్రీడాకారులకు భోజన వసతి కల్పించడం హర్షణీయం అన్నారు. ఈ ఏపీడీ సోశేఖర్‌రెడ్డి, ఎంపీడీఓ జ్యోతి, నగర కమిషనర్ రాముడు, ఈఓపీఆర్‌డీ శారదారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కడప సెబ్ సీఐగా ఎం.లక్ష్మణ్ దాసు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. 2013 బ్యాచ్ కు చెందిన ఈయన ప్రస్తుతం నంద్యాల నుంచి కడప కు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడైనా బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నట్లు తెలిస్తే వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. నిఘా ముమ్మరం చేస్తామన్నారు. ఇందుకు ప్రజలు కూడా సహకరించాలని కోరారు.

రేపు ఎంపీ, ఎమ్మెల్యే రాక

వీరపునాయునిపల్లె : కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి శుక్రవారం మండలంలో పర్యటించనున్నట్లు మండల అధ్యక్షుడు కల్లూరు రఘునాథరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మండల పర్యటనలో భాగంగా శుక్రవారం ఉదయం 7.30 గంటలకు అనిమెల గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనం, 8.30 గంటలకు ఉరుటూరులో నూతనంగా నిర్మించిన సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్ భవనాలను వారు ప్రాంభిస్తారన్నారు. అనంతరం వీఆర్ఎస్ డిగ్రీ కళాశాల ఆవరణలో వైయస్సార్ ఆసరా సంబరాల కార్యక్రమంలో పాల్గొంటారన్నారు.

ఓ యువతా మేలుకో...

నవసమాజ నిర్మాణం కోసం విద్యార్థుల భారీ ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు కల్చరల్: యువత చైతన్యవంతం అయినప్పుడే దేశం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని జీవనజ్యోతి విద్యాసంస్థల కరస్పాండెంట్ వై.అమర్‌నాథరెడ్డి పేర్కొన్నారు. నవ సమాజ నిర్మాణం కోసం భావితరాల ఉజ్వల భవిష్యత్ కోసం యువత, విద్యార్థులతో జీవనజ్యోతి విద్యాసంస్థల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. వన్‌టౌన్ సర్కిల్ నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ గాంధీరోడ్డు, విజయకుమార్ సర్కిల్, రాజీవ్ సర్కిల్, శివాలయం సర్కిల్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన యువతను ఉద్దేశించి మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలతో పెడతోవ పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్న వయసులోనే పిల్లలకు సెల్ ఫోన్ ఇవ్వడం వల్ల వారు దుర్వినియోగం చేయడంతో పాటు దానికి వ్యసనంగా మారుతున్నారన్నారు. మోటార్ సైకిళ్ల ట్రిపుల్, ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ ప్రమాదాలకు కారణమవడంతో పాటు తల్లిదండ్రులకు శోకం మిగిలిస్తున్నారన్నారు. యువత బెట్టింగులు, మద్యం, ధూమపానం వంటి చెడు అలవాట్లతో ఆరోగ్యాన్ని, జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలు ఏం చేస్తున్నారో కనిపెట్టుకుని ఉండాలని, ఎక్కడ తిరుగుతున్నారో గమనిస్తూ ఉండాలన్నారు. క్షణికానందం, క్షణికావేశంలో నిర్ణయాలు తీసుకుంటూ జీవితాన్ని బుగ్గిపాలు చేసుకుంటున్నారని.. ఇది తగదన్నారు. తల్లిదండ్రుల శ్రమను, కష్టాన్ని గుర్తించి క్రమశిక్షణతో మెలిగి ఉన్నత మైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఉజ్వల భవిష్యత్‌కు బాట వేసుకోవాలని ఆకాంక్షించారు. ఈ ర్యాలీలో జీవనజ్యోతి విద్యాసంస్థల వ్యవస్థాపకుడు గురుదేవ్ రామిరెడ్డి, పలు జూనియర్, డిగ్రీ కళాశాలల విద్యార్థులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. పోలీసులు ట్రాఫిక్‌కు అంతరాయం కలుగ కుండా బందోబస్తు నిర్వహించారు.

ఫిర్యాదులన్నీ పరిష్కరిస్తాం

కమలాపురం : అన్ని రాజకీయ పార్టీల నాయ కులు ఇచ్చిన ఫిర్యాదులన్నీ పరిష్కరిస్తామని ఎన్నికల రిటర్నింగ్ ఆఫీ సర్ చంద్రమోహన్ తెలిపారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 22న తుది నియోజకవర్గ ఓటర్ల కొత్త జాబితా వచ్చిందని ఇందులో 2,00,222 మంది నియోజకవర్గంలో ఓటర్లుగా ఉన్నారని తెలిపారు. ఈ జాబితాలో కూడా ఏవైన తప్పులు ఉంటే అన్ని రాజకీయ పార్టీల నాయకులు ఫిర్యాదులు లిఖిత పూర్వకంగా ఇవ్వవచ్చని, అన్ని ఫిర్యాదులను పరిష్కరిస్తామన్నారు. 1500 ఓట్లు కంటే ఎక్కువ ఓట్లు ఉంటే వాటిని రెండు పోలింగ్ కేంద్రాలుగా విభజిస్తామన్నారు. ప్రస్తుతం సీకే దిన్నె మండలం విశ్వనాథపురంలో 1500 మంది ఓటర్లు ఉన్నారని, ఆ పీఎస్‌ను రెండుగా చేస్తామన్నారు. ఇంకా ఇలాంటి పీఎస్‌లు ఉంటే తప్పకుండా విభజన చేస్తామన్నారు. నామినేషన్ వేసే చివరి రోజు కూడా ఓటు నమోదుకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. తహసీల్దార్లు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.